క్లుప్తంగా

రేపటి నుంచి ముత్యమాంబ దీక్షలు


కె.జె.పురం ముత్యమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో గల ముత్యమాంబ అమ్మవారి మాలాధారణ కార్యక్రమం ఈ నెల 18 వ తేదీన ప్రారంభం అవుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆడారి బాబ్జి తెలిపారు. ప్రతి ఏటా మార్గశిర మాసం లో అమ్మవారి మాలాధారణ జరుగుతుందన్నారు. 9 రోజుల పాటు మాలాధారణ అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని, మాలాధారణ చేసే భక్తులు ఆలయ కమిటీ వారిని సంప్రదించాలని ఆయన కోరారు.

సత్యవరంలో మేలుకొలుపు


మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

మాడుగుల: మండలంలో సత్యవరం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున సుమారు 200 మంది మహిళలు మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రామాలయంలో భజన కార్యక్రమం చేపట్టారు. గత 30 ఏళ్ల నుంచి ధనుర్మాసంలో మేలుకొలుపు కార్యక్రమాలు భోగి పండుగ వరకు నిర్వహిస్తున్నారని, హిందూ ధర్మ ప్రచారకులు తవ్వా సన్యాసి శెట్టి తెలిపారు.

ఇంధన పొదుపుపై డ్రాయింగ్ పోటీలు

నర్సీపట్నం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏపీఈపీడీసీఎల్ అధికారులు వేములపూడి మోడల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ త్రినాథరావు మాట్లాడుతూ విద్యుత్‌ను వృథా చేయకుండా ఆదా చేద్దామన్నారు. విద్యుత్‌ను వృథా చేస్తే భవిష్యత్ తరాలకు అంధకారాన్ని మిగిల్చిన వారవుతారన్నారు. ప్రతి ఒక్కరికి ఇంధన పొదుపుపై అవగాహన అవసరమన్నారు. ఈ నెల 20వ తేదీతో వారోత్సవాలు ముగుస్తాయని, అదే రోజు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతో ఇంధన భద్రత


వడ్డాది హైస్కూల్లో విద్యుత్ పొదుపుపై వివరిస్తున్న డీఈఈ అప్పలనాయుడు

చోడవరం: విద్యుత్ ఆదా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై నర్సాపురం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ గౌరీ ప్రసాద్, ఏఈ టి.ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. విద్యుత్ ఇంధనాన్ని ఎలా పొదుపు చేయాలనే అంశంపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని భావితరాలకు ఎలాంటి మేలు జరగాలనే అంశంపై బొమ్మలు గీశారు. విద్యుత్‌ను ఆదా చేయడం వల్ల తక్కువ కరెంటు బిల్లు రావడంతో పాటు భవిష్యత్ రోజుల్లో విద్యుత్ కొరత లేకుండా ఉంటుందని ఏడీఈ గౌరీప్రసాద్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ప్రజలను, విద్యార్థులను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో జాతీయ ఇంధన పొదుపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడడం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందని విద్యుత్ ట్రాన్స్‌కో డీఈఈ ఎస్.అప్పలనాయుడు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. విద్యుత్ పొదుపు వల్ల వినియోగ బిల్లు కూడా కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ రాజు, హెచ్ఎం శేషుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

నాడు కట్టిన వారధి... నేడు రైతుకు పెన్నిధి

- మూడు ప్రధాన వంతెనల నిర్మాణంతో తీరిన ప్రయాణ కష్టాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే నిధుల మంజూరు
- వర్షాల సమయాల్లో వంతెనలపై నిశ్చింతగా జనం రాకపోకలు
- కల్లాలకు పంటల తరలింపునకు మార్గం సుగమం
- మాజీ డిప్యూటీ సీఎం బూడి కృషి వల్లేనని రైతుల ఆనందం


సాయిపురాయుడి గెడ్డపై వంతెన నిర్మాణం పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి.(ఫైల్)


చిట్టిగెడ్డపై గతంలో వంతెన కుంగిన ప్రాంతం


మల్లంపాలెం-చౌడువాడ మధ్య చిట్టిగెడ్డపై నిర్మాణం పూర్తయిన వంతెన

కె.కోటపాడు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో మండలంలో మూడు ప్రధాన వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. చౌడువాడ-మల్లంపాలెం గ్రామాల మధ్య చిట్టిగెడ్డపై వంతెన నీలం తుఫాన్ సమయంలో కుంగిపోయింది. దీంతో ఎన్నో ఏళ్ళుగా వంతెన నిర్మాణంకు ప్రజలంతా ఎదురు చూశారు. వంతెన సమస్యను గుర్తించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అప్పట్లో వంతెన పునఃనిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరు చేశారు. సూర్రెడ్డిపాలెం-మేడిచర్ల గ్రామాల మధ్య మొండిగెడ్డను దాటడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. దీనిపై వంతెన నిర్మాణంతో పాటు సూర్రెడ్డిపాలెం నుంచి పైడంపేట వరకూ తారురోడ్డు నిర్మించడానికి 2020లో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సుమారు రూ.5 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో వంతెన నిర్మాణం కూడా మొండిగెడ్డపై పూర్తయ్యింది. కొరువాడ జగన్నాథపురం కూడలి నుంచి దాలివలస రైవాడ కెనాల్ మార్గం వరకూ తారురోడ్డు నిర్మాణంతో పాటు ఈ మార్గం మధ్యలో గల సాయిపురాయుడి గెడ్డపై వంతెన నిర్మాణానికి కూడా ముత్యాలనాయుడు రూ.కోటి 20 లక్షలు మంజూరు చేయించారు. ఆయా నిధులతో రోడ్డు, వంతెనల నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయి ప్రారంభం కావడంతో నేడు రైతులు, ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరాయి.

రాకపోకలకు తొలగిన కష్టాలు

మల్లంపాలెం-చౌడువాడ గ్రామాల మధ్య చిట్టిగెడ్డపై వంతెన కుంగిన సమయంలో ప్రజలు వంతెన మార్గంలో రావాలంటే భయాందోళన చెందేవారు. ఈ మార్గం గుండానే గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకును రైతులు తరలించాల్సిన పరిస్థితి ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో ఎక్కువ దూరం ప్రయాణించి చెరకును తరలించాల్సి వచ్చేది. అలాగే సూర్రెడ్డిపాలెం-మేడిచర్ల గ్రామాల మధ్య మొండిగెడ్డ మార్గం గుండా రైతులు పొలాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ గెడ్డ నుండే సూర్రెడ్డిపాలెం చెరకు తూనిక కేంద్రానికి రైతులు చెరకును తరలించేవారు. ఆ సమయాల్లో పలుమార్లు ప్రమాదాలు సంభవించేవి. కొరువాడ జగన్నాథపురం కూడలి నుంచి రైవాడ కెనాల్ మధ్య సాయిపురాయుడిగెడ్డపై వంతెన లేని సమయంలో వర్షపునీటి గుండా గెడ్డ ప్రాంతంలో రాకపోకలు చేసే సమయాల్లో పశువులు, రైతులు గెడ్డ నీటి ఉధృతికి ప్రమాదాలకు గురయ్యేవారు. పండించిన పంట ఉత్పత్తులను కూడా ఈ గ్రామాల రైతులు తరలించుకోవడానికి కూడా అవస్థలు పడేవారు. ఈ మూడు ప్రధాన వంతెనలు గత ప్రభుత్వ హయాంలోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో ప్రస్తుతం రైతులు నిశ్చింతగా రాకపోకలు సాగిస్తున్నారు.


సాయిపురాయుడిగెడ్డపై నిర్మాణం జరిగిన వంతెన ప్రాంతం

మాజీ డిప్యూటీ సీఎం బూడి కృషి వల్లే...



గత ప్రభుత్వ హయాంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామాన్ని సందర్శించినపుడు రోడ్డు, వంతెన సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. పండించిన పంటలను సాయిపురాయుడిగెడ్డ మార్గం గుండా తీసుకువస్తున్న సమయంలో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించాం. దీంతో మట్టిరోడ్డు, గెడ్డ ప్రాంతాన్ని ఆయన పరిశీలించి రోడ్డుతో పాటు వంతెన నిర్మాణానికి రూ.కోటి 20లక్షలు మంజూరు చేశారు. సకాలంలో పనులు పూర్తి చేసి వంతెనను కూడా ప్రారంభించారు. ఆయన కృషి వల్లే నేడు ప్రజలు, రైతులు నేడు నిశ్చింతగా వంతెన పై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఆయనకు మా గ్రామస్థులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

–చీపురుపల్లి గోవింద, కొరువాడ జగన్నాథపురం

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 14 ఏళ్లుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతి ఏటా శిబిరంలో తాను మొదటగా రక్తదానం చేస్తున్నానన్నారు. అలాగే నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇతరులకు సహాయం చేయాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఒక జీవితాన్ని కాపాడిన సంతృప్తి దాతలకు కలుగుతుందన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు, విద్యార్థులు శిబిరానికి విచ్చేసి రక్తదానం చేయాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, ఎంపీపీ రాజేశ్వరి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, జెడ్పీటీసీ గిరిబాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


పార్టీ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

భక్తిశ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజు


కొవ్వూరు గ్రామంలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభిస్తున్న సర్పంచ్ కాంతమ్మ


చోడవరం : ధనుర్మాసోత్సవాలు వైష్ణవాలయాల్లో సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెలరోజుల పాటు చోడవరం శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయంలో జరపనున్న ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కందర్ప శంకర్, విజుమూరి శంకర్, ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఎంపీటీసీ పెట్రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.కేశవస్వామి దేవాలయం, గోవాడ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ధనుర్మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామికి ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు చేశారు.

రోలుగుంట : కొవ్వూరు గ్రామంలో భక్తాంజనేయ భజన బృందం వారు ఆధ్వర్యంలో ధనుర్మాసోత్సవాలు పురస్కరించుకుని గంట మోగించి భజన కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 13 వ తేదీ వరకు రామాలయంలో భజన కార్యక్రమం నిర్వహిస్తారు. కార్యక్రమాన్ని సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ ప్రారంభించారు. గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాడుగుల రూరల్ : నెలగంట పెట్టడంతో సోమవారం ఉదయం 6.35 గంటలకు ధనుర్మాస వ్రతంతో దేవాలయాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 13వ తేదీ భోగి పండగ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం వుంటాయని, వచ్చే నెల 13న జరిగే భోగి పండగ రోజున స్వామి వారు తిరువీధి ఉత్సవం, అనంతరం కె.జె.పురం కళావేదిక మీద రాత్రికి గోదాదేవి రంగనాథ కళ్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కె.జె.పురం రామాలయంలో ఉత్సవాల సందర్భంగా భక్తుల మేలుకొలుపు కార్యక్రమం జరుగుతుంది.

మాడుగుల : స్థానిక పార్థసారథి, వేంకటేశ్వర, వేణుగోపాలస్వామి, సీతారామస్వామి, జగన్నాథ స్వామి ఆలయాల్లో సోమవారం ఉదయం నెల గంట మోగించి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారలను ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం నుంచి భోగి పండగ వరకు మేలుకొలుపు కార్యక్రమాలతో పాటు ప్రతిరోజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని, వేంకటేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనువాసాచార్యులు తెలిపారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత


తూటిపాలలో మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

మాకవరపాలెం: ఇంధన పొదుపు అందరి బాధ్యతని విద్యుత్‌శాఖ ఏఈ బాలకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్‌ను ఎంపీడీవో సీతామహాలక్ష్మితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరం మేరకే విద్యుత్ వాడాలన్నారు. విద్యుత్ పొదుపుపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇంధన పొదుపుపై ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు.

మిగులు భూమిని సర్వే చేయాలి


డిటికి వినతిపత్రం ఇస్తున్న భద్రాచలం, రైతులు

మాకవరపాలెం : ఏపీఐఐసీ పేరున నమోదైన భూములను రైతుల పేరున ఆన్‌లైన్ చేయాలని రైతులు అధికారులను కోరారు. రాచపల్లిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు భూ సమస్యలపై వినతులు అందజేశారు. ఆన్‌రాక్ రిఫైనరీ నిర్మాణానికి సేకరించగా మిగిలిన సుమారు 500 ఎకరాల రైతుల భూములను 15 ఏళ్ల క్రితం ఏపీఐఐసీదిగా నమోదు చేసేశారు. దీంతో గత పదేళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ సదస్సులో మాజీ డీసీసీబీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత పెట్ల భద్రాచలం ఆధ్వర్యంలో రైతులు డీటీ సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. రిఫైనరీకి సేకరించగా మిగిలిన భూమిని రీ సర్వే చేసి తమ పేరున ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సాంబశివరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


గురువులతో పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : నర్సీపట్నం హైస్కూల్‌లో 1988–89లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం బలిఘట్టం ఉత్తరవాహినిలో జరిగింది. ఈ కార్యక్రమానికి జి.టి.వి.ఎస్.ఆర్.కె.రాజు, మొండెం పోతురాజు, బైపురెడ్డి గిరిబాబు, గుప్తా, రామ్‌ప్రసాద్ ఆర్గనైజర్లుగా వ్యవహరించారు. వివిధ వృత్తుల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి, విద్యార్థి దశలో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు నాగేశ్వరరావు, అప్పలస్వామి, గంగాధరరావు, నాయుడు, త్రినాథరావు దంపతులు, మూర్తి, జార్జిలను ఘనంగా సన్మానించారు. 25 ఏళ్ల తరవాత తమను గుర్తు పెట్టుకుని సన్మానించిన పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. అనంతరం వివిధ కార్యక్రమాలతో సరదాగా గడిపారు.

పెదమడి కాలువ నీటిసంఘం అధ్యక్షుడిగా అప్పారావు

మాడుగుల రూరల్ : వంటర్లపాలెం పెదమడి కాలువ నీటి సంఘం అధ్యక్షుడిగా లెక్కల అప్పారావు, ఉపాధ్యక్షుడిగా కర్రి మాలిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నాయకులు దండి బాబూరావు తదితరులు వారిని సోమవారం అభినందించారు. సంఘం డైరక్టర్లుగా చదరం మాలిబాబు, సకల ప్రసాదరావు, బొమ్మిశెట్టి అప్పారావు, సాయిం రమేష్‌లను కూడా అభినందించారు.

జనం సమస్యలా..మాకేం పని!

- పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా
- ఆఫీసు సిబ్బందితో తూతూ మంత్రంగా కార్యక్రమం
- ఆర్డీవో ఆదేశాలు బేఖాతరు


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విచ్చేసిన వివిధ శాఖల కార్యాలయ సిబ్బంది

నర్సీపట్నం : రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరిష్కార వేదికకు అధికారుల నుంచి స్పందన కరువైంది. గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ఆర్డీవో వి.వి.రమణ ప్రతి రోజు డివిజన్‌లో ఎక్కడో ఒకచోట పాల్గొంటున్నారు. ఇదే అదునుగా వివిధశాఖల అధికారులు పరిష్కార వేదికు డుమ్మా కొట్టారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆర్డీవో కార్యాలయంలో పరిష్కారమవుతాయనే నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి నిరాశ ఎదురువుతోంది. సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి మాత్రమే హాజరయ్యారు. పురపాలకశాఖ నుంచి కార్యాలయ మేనేజర్, విద్యుత్‌శాఖ నుంచి టౌన్ ఏఈ, ఆరోగ్యశాఖ నుంచి కార్యాలయ సిబ్బంది, ఐసీడీఎస్ నుంచి సూపర్‌వైజర్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల శాఖల నుంచి కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు. ఆర్అండ్‌బీ నుంచి కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మాత్రమే హాజరు కావడం గమనార్హం. డివిజన్ స్థాయి అధికారులు ఎవరూ రాకపోవడంతో చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తప్పని సరిగా డివిజన్‌స్థాయి అధికారులు హాజరు కావాలని ఆర్డీవో అనేక సందర్భాల్లో హెచ్చరించినప్పటికీ అధికారులకు పట్టడం లేదు. ఆర్డీవో రెవెన్యూ సదస్సులకు వెళ్లడంతో ఇదే అదునుగా అధికారులు ఆఫీస్ సిబ్బందిని పరిష్కార వేదికకు పంపించి చేతులు దులుపుకొంటున్నారు. సుమారు 30కిపైగా వివిధ శాఖలు ఉన్నప్పటికీ కేవలం ఎనిమిది శాఖల నుంచి డివిజన్ స్థాయి కింది స్థాయి సిబ్బంది పాల్గొన్నారు. డివిజన్‌స్థాయి అధికారులంతా విశాఖపట్నం నుంచి రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పరిష్కార వేదికకు సిబ్బందిని పంపించి తాము గైర్హాజరవుతున్నారు. అధికారుల తీరుతో ప్రజలు నిరాశకు గురువుతున్నారు.

ప్రతి నెలా జీతాలు చెల్లించండి

- స్కూళ్లలోని పారిశుధ్య కార్మికుల వేతలు తీర్చండి
- సీఐటీయూ నాయకుల ర్యాలీ


ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు నరసింహమూర్తి తదితరులు

మాడుగుల : ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ ఉన్న ఐదు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయు నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ పార్కు నుంచి ఎంఆర్‌సీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో పాండురంగారావుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయు మండల నాయకులు ఇరటా నరసింహమూర్తి, శానిటేషన్ వర్కర్ల యూనియన్ ప్రెసిడెంట్ రవి మాట్లాడారు. అనేక ఏళ్లుగా శానిటేషన్ కార్మికులు అతి తక్కువ జీతాలకు పని చేస్తున్నారని, వీరికి నెలనెలా జీతాలు చెల్లించక ఇబ్బందులు పడుతున్నారని, వీరికి ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక శానిటేషన్ ఆయాను నియమించాలని, ప్రతి నెలా 5 వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, చీపుర్లు, ఫినాయిల్ సమకూర్చాలని, కార్మికులకు ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు సభ్యురాలు కె.భవాని, వర్కర్ల యూనియన్ కార్యదర్శి మహాలక్ష్మి పాల్గొన్నారు.

వనరుల సద్వినియోగంతో సుస్థిరాభివృద్ధి


దేవరాపల్లి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి



మాడుగులలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

దేవరాపల్లి : గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు కీలక భూమిక పోషించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల కనీస అవసరాలు తీరుస్తూ, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని వనరులు సద్వినియోగం సాధించడమే సుస్థిర అభివృద్ధి లక్ష్యమని అన్నారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, రైవాడ పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు మాట్లాడుతూ పర్యావరణ, సామాజిక, ఆర్థిక సుస్థిరతను సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈఈ కె. ఉమామహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె.చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ ఎస్.భవ్యతేజ, ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు, ఏపీఎం ఎస్. ప్రభాకర్, వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ పాల్గొన్నారు.

మాకవరపాలెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి సోమవారం నుంచి రెండు రోజులపాటు సుస్థిర అభివృద్ధిపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతామహాలక్ష్మి గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు, తదితర తొమ్మిది అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో మూర్తి, వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరణ్ పాల్గొన్నారు.

మాడుగుల : అవసరం లేకుండా ప్రకృతి వనరులు వినియోగించరాదని, ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో సర్పంచ్‌లు , సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందాలంటే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా ప్రకృతి వనరులతో పాటు ప్రభుత్వ నిధులతో అందరికీ సంపద సృష్టించాలన్నారు. రానున్న కాలంలో వ్యవసాయ భూమి తగ్గుతుండడంతో ఉత్పాదకత పెంపుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో పీఆర్‌డీ సతీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి అవసరం


మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : అధికారులంతా ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. కె.కోటపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ మాట్లాడుతూ చౌడువాడ పీహెచ్‌సీకి వస్తున్న రోగుల సంఖ్య తగ్గుతుందని, రోగుల సంఖ్య ఎందుకు తగ్గుతుందన్న విషయాన్ని వైద్య సిబ్బంది గుర్తించాలని కోరారు. ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవల్లో ఇటీవల వైద్యాధికారులు లేకుండానే శిబిరాలను నిర్వహిస్తున్నట్టు సూదివలస ఎంపీటీసీ వర్రి రామునాయుడు తెలిపారు. ఇటీవల పీహెచ్‌సీలలో వైద్యులు పీజీ చదువులకు వెళ్లడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని, మరో 15 రోజుల్లో ఈ సమస్య తీరనుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు అన్నారు. వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేయాలని, రైతులు విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా వ్యవసాయ కనెక్షన్‌లు వేయడం లేదని చౌడువాడ ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ తెలిపారు. వి.సంతపాలెం రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్‌లను మంజూరు చేయాలని సర్పంచ్ లెక్కల దేవీలత ఏఈ చంద్రశేఖర్‌ను కోరారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా 11 గ్రామాల్లో 51 పనులు రూ.6.29 కోట్లతో జరుగుతున్నట్టు పీఆర్ ఏఈ సుమతి తెలిపారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కుమార్, ఎంపీడీవో సాంబశివరావు, సూపరింటెండెంట్ అప్పలరాజు, వైస్ ఎంపీపీ నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీలు అచ్చిబాబు, రామునాయుడు, గోపి, బంగారి లక్ష్మి, పైడితల్లమ్మ, సౌజన్య, దేముళ్లు, ఎరుకునాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని నాగజ్యోతికి సత్కారం

రోలుగుంట: రోలుగుంట ఉపాధ్యాయుని నాగజ్యోతి ఉపాధ్యాయులకు ఆదర్శం అని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. ఆదివారం బొజ్జనకొండ వద్ద పీఆర్‌టీయు ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో ఆమెను సన్మానించారు. పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు. నాగజ్యోతి జిల్లా మహిళా కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు.

నేడు రెండు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

చీడికాడ : మండలంలో రెండు సచివాలయాల్లో మంగళవారం ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో శ్యామ్‌సుందర్‌రావు సోమవారం తెలిపారు. శిరిజాం, అప్పలరాజుపురం గ్రామ సచివాలయాల్లో జరిగే ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో పేర్లు, చిరునామాలో మార్పులు, చేర్పులు తదితర సవరణలు చేసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.